క్లుప్తంగా

చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు వైఎస్సార్ సీపీ నిరసన

క్రోసూరు: ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చే ఇంటి స్థలాలను శ్మశానాలతో పోల్చిన చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు క్రోసూరులోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ , బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాల సెంటర్‌లో శనివారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీపీ పి.కోటయ్య మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో 50 వేల మంది పేదలకి ఇళ్లస్థలాలు ఇవ్వడాన్ని చంద్రబాబు దుర్మార్గంగా మాట్లాడడాన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పేదప్రజలందరూ చంద్రబాబు తీరుపట్ల వ్యతిరేకించాలన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏనాడు పేదలకు మూడు, నాలుగు సెంట్ల భూమి ఇచ్చిన పాపాన పోలేదని, అదీకాక ఎస్సీ, ఎస్టీలంటే తొలి నుంచి చులకన భావన అన్నారు. ప్రతిసారీ ఎస్సీలను కించపర్చడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని అన్నారు. ఆయన సామాజిక వర్గం ప్రజలకు దోచి పెట్టడం ఆయన నైజమని అన్నారు. వారి చేతనే ఓట్లు వేయించుకోవాలన్నారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ మాట్లాడుతూ పేద ప్రజలంటే చులకగా చూసే చంద్రబాబునాయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన్పటి నుంచి ఓర్వలేక నోటికొచ్చినట్లు మాట్లాటం, కోర్టులెక్కడం, పోలీసులను బెదిరించడం , దాడులు చేయించడం చేస్తున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలందరూ చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గార్లపాటిదాసు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందినా, ఇళ్ల స్థలాలు ఇచ్చినా , వారు ఆర్థికంగా బలోపేతం అయినా చంద్రబాబుకు నచ్చదని అన్నారు. చంద్రబాబు పేదల ద్రోహి అని అన్నారు. పేదలకు భూమి ఇచ్చి పక్కా ఇళ్లు కట్టించి ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలను ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ ప్రజలందరూ వ్యతిరేకించి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని, పేదల ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రజానాయకుడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును తిరిగి ఆశ్వీరదించాలని కోరారు. చంద్రబాబు డౌన్, డౌన్, తెలుగుదేశంపార్టీ డౌన్, డౌన్ అంటూ నినాదాలు ఇచ్చుకుంటూ అందుకూరు రోడ్డు వరకు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాశంశ్రీనివాసరెడ్డి, పార్టీ గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ ఖాదర్, ముస్తఫా, వేజండ్లరవి, గంజినబోయినశ్రీనివాసరావు, తుమ్మపూడి ప్రతాప్‌రెడ్డి, మర్రిశ్రీనివాసరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీం, వేణుగోపాలరెడ్డి, లేళ్ల చిరంజీవి, గోపాలకృష్ణ, చిల్కారవి, మేదరరోశయ్య, చిల్కాదాసయ్య, అనంతలక్ష్మీ ,తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరు ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి. శౌరీరాజు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వివరాలు తెలుపుతూ పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి పదవతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, కోర్సుల్లో చేరవచ్చునన్నారు. http://apmr.apcfrr.in, http://crc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా జూన్ నెల ఏడవ తేదీ వరకు దరఖాస్తు చేయవచ్చునన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యుసీ విద్యార్థులు రూ.200 , ఎస్సీ, ఎస్టీలు రూ.150 రుసుము చెల్లించాలన్నారు. ప్రవేశములు పదవతరగతిలో వచ్చిన మెరిట్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు ఇవ్వబడతాయన్నారు. వివరాలకు క్రోసూరు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్, ఎంఈఓను సంప్రదించవచ్చునన్నారు.

24న లీజుహక్కులపై బహిరంగ వేలం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభుగా వెలసిన పవిత్ర సత్తెమ్మతల్లి దేవాలయం వద్ద వివిధ రకాల విక్రయాల లీజు హక్కుపై ఈనెల 24న అచ్చంపేట, మల్లేశ్వరస్వామి దేవాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గాదె రామకోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అయిటమ్‌లవారీగా ధరావత్తు సొమ్మును ప్రకటించారు. పాట కాలము యేడాదిపాటు అంటే ఈనెల 13వ తేదీ నుంచి 2024, మే 12వరకు అమలులో ఉంటుందన్నారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్మునే హక్కుకు ధరావత్తు రూ.50వేలు, ఆలయం వద్ద క్యాంటిన్ నిర్వహించుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్ముకునేందుకు యా.50 వేలు, భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు, చీరెలు, జాకెట్‌ముక్కలు పోగుచేసుకునే వాక్కుకు రూ.20వేలు, టెంటుసామాన్లు, వంటసామాగ్రి అద్దెకిచ్చుకునే హక్కుకు రూ.20వేలు, ఆలయం వద్ద స్టాల్ ఏర్పాటుచేసుకుని అమ్మవారి చిత్రపటాలు, రక్షాబంధన్‌దారములు, జెండాలు, పండ్లు విక్రయించుకునే హక్కుకు రూ.20వేలు, భక్తులు ఇచ్చిన తలనీలాలు ప్రోగుచేసుకునే హక్కుకు రూ.20వేలుగా ధరావత్తును నిర్ణయించడం జరిగిందన్నారు. ఈనెల 24, ఉదయం 10గంటలకు అచ్చంపేట, మల్లేశ్వరస్వామివారి దేవాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు : 9182960378 నెంబరుకు పోను చేసి సంప్రదించవచ్చన్నారు.

సేవకు సముచిత గౌరవం

- వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం
- ఉత్సాహం నింపుతున్న కార్యక్రమం
- నియోజకవర్గంలో 1,301 మందికి సత్కారం



వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: ప్రభుత్వ పథకాలను అర్హులైన నిరుపేదల అందరికీ దరిచేర్చారు. పేదల కన్నీళ్లను తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకొచ్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీ తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు కొత్త ఒరవడి సృష్టించారు. వీరు చేస్తున్న సేవకు ప్రభుత్వం ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తోంది. కొత్త ఆలోచనలతో వలంటీర్ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవం పోశారు. ఆ బాధ్యతలు తీసుకున్న వారంతా యువ సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హులకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు మెచ్చి ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ .30 వేలు, సేవా రత్నకు రూ .20 వేలు, సేవా మిత్రకు రూ .10 వేలు నగదు పురస్కా రంతో పాటు సర్టిఫికెట్, మెడల్ అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారు. సేవా పురస్కారాలతో పాటు వలంటీర్లను బ్యాడ్జీతో పాటు శాలువాతో సత్కరిస్తున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు, వలంటీర్లు ఇలా...

మండలం	సచివాలయాలు	వలంటీర్లు	సేవవజ్ర	సేవరత్న	సేవమిత్ర
సత్తెనపల్లిటౌన్	15	306	01	05	264
సత్తెనపల్లిరూరల్	19	404	-	05	339
ముప్పాళ్ళ	12	197	02	05	188
రాజుపాలెం	14	205	-	05	205
నకరికల్లు	14	335	02	05	275
మొత్తం	74	1,447	05	25	1,271

బాధ్యత మరింత పెంచింది..



నాకు సేవా వజ్ర అవార్డు వరించడం మరింత బాధ్యత పెంచింది. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా సామాజిక సేవా దృక్పథంతో సేవలం దిస్తున్నాను. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను పూర్తి చేసి అధికారుల మన్ననలు పొందేందుకు ఈ అవార్డులు దోహదపడతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నారు.

– పొందుగల శ్రీనివాసరెడ్డి, వలంటీర్, రంగాకాలనీ, సత్తెనపల్లి

నాకు సంతృప్తినిస్తోంది...



అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిలా పని చేయటం, ప్రజలకు మెరుగైన రీతిలో ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు చేరేలా చూడడం నా బాధ్యత. సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పంక్షేమ పాలనలో భాగస్వాములు కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. సంక్షేమ పథకాలు అమలు చేయడం సంతృప్తినిస్తోంది. సేవా వజ్ర పురస్కారానికి నేను ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– దొడ్డ విజయలక్ష్మీ, వలంటీర్, దేచవరం, నకరికల్లు

సీఎం ఆశయ సాధనకు కృషి..



నాకు సేవ వజ్ర అవార్డు రావడం నాలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ ఆంకాంక్షలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించడం నా ధ్యేయం. నెల మొదటి రోజే వృద్ధులకు పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చేందుకు వలంటీర్‌గా నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటా.

– బొంతు ఆరోగ్యమ్మ, వలంటీర్, మాదల, ముప్పాళ్ళ

దళారుల ప్రమేయం లేకుండా..



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేసేందుకు నా వంతు బాధ్యత నిర్వర్తిస్తూ ఉంటా.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు చేరువచేయడమే నా ప్రధాన కర్తవ్యం. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా సచివాలయాల్లో దరఖాస్తు చేయడం, అర్హులకు పథకాలు అందించడం నా బాధ్యత. నా సేవలకు సేవా వజ్ర పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– షేక్ కరిమూన్, వలంటీర్, చాగల్లు, నకరికల్లు

చాలా సంతోషంగా ఉంది ..



ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి సేవా పురస్కారాలు అందించడం చాలా సంతోషంగా ఉంది. వలంటీర్ మరింత సేవ చేయాలనే సంకల్పం పెరిగింది. ఈ విధానం వలంటీర్ల విధి నిర్వహణకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. సంక్షేమ పథకాలు వివక్షకు తావులేకుండా వలంటీర్ల ద్వారా అర్హులందరికీ అందుతున్నాయి. నాకు సేవావజ్ర పురస్కారం రావడం చాలలా సంతోషంగా ఉంది.

– అరిగిలి నాగమణి, వలంటీర్, గోళ్ళపాడు, ముప్పాళ్ళ

కంకణాలపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ సాయి తేజ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 85 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జనరల్ ఓపి 33 మంది, హైపర్ టెన్షన్ 25 మంది, డయాబెటిస్ 23 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 10 మంది, గర్భవతులు 9 మంది, బాలింతలు ఒకరు ఉన్నారు. అనంతరం నడవలేక దీర్ఘకాలిక వ్యాధులతో గృహాల్లోనే ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏ.వరలక్ష్మి, ఎమ్ఎల్‌హెచ్‌పీ డి. తిరుమలవేణి, ఏఎన్ఎం షేక్ మస్తాన్, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, ఆశా కార్యకర్తలు నాగజ్యోతి, లక్ష్మి, రమాదేవి, తదితరులు ఉన్నారు.



కంకణాలపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయి తేజరెడ్డి

మాదలలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణప్రవీణ పాల్గొని 150 మందికి వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సత్తెనపల్లి సాధనకు ట్రిపుల్ ఆర్ సెంటర్లు

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లి సాధనకు ట్రిపుల్ ఆర్ సెంటర్లను పుర ప్రజలు వినియోగించు కోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని 9వ సచివాలయంలో మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మితో కలిసి ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని 15 సచివాలయాల్లో ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ కూడ ముఖ్యంగా ఇళ్లలో వేస్ట్‌గా పనికిరాని వస్తువులను పారవేయకుండా, ఇతరులకు సంబంధించి పనికి వచ్చే వస్తువులు చెప్పులు, బూట్లు, మంచాలు, వస్తు సామగ్రి, నివశించడం కోసం ఉపయోగించే దిండ్లు, దుప్పట్లు, తదితర సామగ్రిని, తమకు ఉపయోగపడని ఏ వస్తువైనా సరే వాటిని దగ్గరలోని సచివాలయంలో కానీ, శానిటరీ సెక్రటరీలకు గానీ సిబ్బందికి తెలియా చేసిన లేదా తెచ్చి ఇచ్చినా వారు ఆర్.ఆర్. ఆర్. సెంటర్లో జాగ్రత్త పరుస్తారన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించి, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారధి, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, ఆకుల రమేష్, శానిటరీ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చల్లంచర్ల, కమిషనర్ షమ్మి, కౌన్సిలర్లు

రేపు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం

క్రోసూరు: మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఈనెల 22న సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య శనివారం తెలిపారు. ఎంపీపీ పి.పెరుమాళ్లపల్లి కోటయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. 2022–23 ఆర్థికసంవత్సరం వార్షిక లెక్కల ఆమోదం, మండలంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పాలిసెట్-23 లో కుంభా మౌనికకు 460 వ ర్యాంకు



కుంభా మౌనిక

క్రోసూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ -23 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో క్రోసూరుకు చెందిన కుంభా మౌనిక అనే విద్యార్థిని 460 వ ర్యాంకు సాధించినట్లు శనివారం జైభారత్ స్కూల్ డైరెక్టర్ జైనేంద్రరెడ్డి తెలిపారు. తమ పాఠశాలలో కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో పదివేల లోపు ర్యాంకును ఐదు గురువిద్యార్థులు, ముఫ్పై వేల లోపు ర్యాంకు ముగ్గురు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కుంభా మౌనికను కోచింగ్ సెంటర్ అధ్యాపకులు డి.కోటేశ్వరరావు,పి.శ్రీనివాసరావు , అభినందించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

సత్తెనపల్లి: ఎండల నుంచి బాటసారులు ఉపశమనం పొందడానికి మజ్జిగ ఉపయోగపడతాయని సత్తెనపల్లి టౌన్‌సీఐ యు.శోభన్‌బాబు అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాని శనివారం ఆయన ప్రారంభించారు. జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ సీఐ శోభన్ బాబు హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దళితులంటే టీడీపీ నేతలకు ఇంత చిన్న చూపా

సత్తెనపల్లిలో హెచ్చరించిన దళిత సంఘాల నేతలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ నేతలు

సత్తెనపల్లి: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పై నిరాధార ఆరోపణలు చేసిన తురక గంగమ్మకు ఇంటి వద్దకు వెళ్లి సాయం చేసి, దివ్యాంగురాలు అయిన నాగలక్ష్మి ని మీ పార్టీ (టీడీపీ) కార్యాలయానికి ఎందుకు రమ్మన్నారు..? అంబటిని విమర్శించి న వారిపై అభిమానం, వికలాంగురాలిపై చిన్న చూపా, దళితులంటే ఇంతటి వివక్ష ప్రదర్శిస్తారా? మానవత్వంతో సాయం చేసిన మంత్రి అంబటి పై మరోసారి నోరు జారితే నీ ఇంటి కొచ్చి కాళ్ళు నరుకుతాం జీవీ ఆంజనేయులు అంటూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వినుకొండ మాజీ శాసన సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు మాట ఇచ్చి విస్మరించి, హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోతే.. సానుభూతితో దివ్యాంగురాలు నాగలక్ష్మి కి సాయం చేయడానికి మంత్రి అంబటి రాంబాబు ముందుకు వచ్చారన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకోలేని మీరు, దళితులకు ద్రోహం చేసిన మీరు .. సాయం చేసిన మమ్మల్ని, మానవత్వం చూపిన మంత్రి అంబటిని నాలుక కోస్తా అంటావా జీవీ ఆంజనేయులు.. నువ్వు కొయ్యటానికి సత్తెనపల్లి రావాలని, మేము కొయ్యాలి అనుకుంటే వినుకొండలో నువ్వు చేసిన లేకి పనులకు నీ పక్కనే ఉన్న వాళ్ళతోనే నీ నాలుక కోయించగలమన్నారు. దళితులకు రాజకీయాలు ఎందుకురా పిచ్చి ముండాకొడుకుల్లారని కూసింది మీకు గుర్తులేదా జీవి అని నిలదీశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు యాసారపు బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కోడి రెక్క దేవదాసు, జూపల్లి పాల్, సర్పంచ్‌లు అనిల్, వేమవరపు బుల్లి బాబు, నందిగం యల్లమంద సంకటి శ్యామ్‌సన్, కోటేశ్వరరావు, కాటుమాల దేవిడ్, నాగేశ్వరరావు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం ఉదయం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలను నివారించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పనిచేయకుండా ఉన్న బోర్లును గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నందిరాజుపాలెంలో గ్రామంలో ఇప్పటికే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. అదే విధంగా గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు కొనసాగుతున్న తరుణంలో పని ప్రదేశాల్లో కూలీలకు వసతులను కల్పించాలని సూచించారు. తాగునీరు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, ఎండ ప్రదేశాల్లో టెంట్లు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భవనం వెంకటరెడ్డి, తహసీల్దార్ నిర్మల, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, చిట్టెంశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై ఎరువులు

నకరికల్లు: రైతుభరోసాకేంద్రాల ద్వారా రాయితీపై ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. నకరికల్లులోని రైతుభరోసాకేంద్రంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో లోతుదుక్కులు వేయాలన్నారు. భూసారపరీక్షలు చేసి ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూమిలో పోషకాల లభ్యత పెరుగుతుందని అన్నారు. జీలుగను 50 శాతం రాయితీపై కిలో రూ. 39.50లకు, జనుము 50 శాతం రాయితీపై కిలో రూ.42లకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం–2 కార్యదర్శి వరికూటి సైదారెడ్డి, వీఆర్వో నాగలక్ష్మి, వ్యవసాయ సహాయకులు షేక్.సుభాని, వై.ప్రభాకర్, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం

క్రోసూరు: మండలంలోని ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం కురిసింది. తీవ్రమైన ఉరుములు, మెరుపులకు మండలంలోని పీసపాడు, క్రోసూరు, అనంతవరం, దొడ్లేరు గ్రామంలో చెట్లు పడిపోయాయి. రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతవరం గ్రామంలో ఈదురుగాలులకు ఇంటిపై రేకుల కప్పు లేచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్లుపాడయ్యాయి. విద్యుత్‌స్థంభాలు పడిపోయాయి. దొడ్లేరులో అదేవిధంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పీసపాడు గ్రామంలో పొలాల్లో తాడిచెట్టుపై పిడుగు పడి చెట్టు దగ్ధమైంది. శుక్రవారం రాత్రి కూడా తీవ్రమైన ఉరుములు, మెరుపుల కూడిన వర్షం పడినప్పటికీ ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయినట్లు కొంతమంది తెలపడం జరిగింది.



తాటి చెట్టుపై పిడుగుపడడంతో దగ్ధమవుతున్న దృశ్యం

నేడు టెన్త్ ప్రతిభావంతులకు చిరు సత్కారం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య సేవాసమితి ఆధ్వర్యంలో టెన్త్ పరీక్షాఫలితాల్లో సత్తెనపల్లి పట్టణంలోనీ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రతి పాఠశాల నుంచి ప్రథమ స్థానంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు చిరు సత్కారం, జ్ఞాపికను అందించడం జరుగుతుందని సమితి అధ్యక్షుడు వెలుగూరి శరత్ బాబు శనివారం తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థల ప్రతినిధులు, ఆర్యవైశ్య సేవా సమితి కార్యవర్గము, సత్తెనపల్లి పురప్రముఖులు ఖచ్చిత సమయానికి హాజరుకావాలన్నారు. ఏదైనా సమాచార లోపం వలన ఏదైనా పాఠశాల వారికి సమాచారం తెలియక పోయినా ఇదే ఆహ్వానముగా భావించి తమ పాఠశాల నుంచి అత్యధిక మార్కులు వచ్చిన వారిని ఈ కార్యక్రమానికి తీసుకుని రావాలని కోరారు.

చందనాలంకారంలో వేంకటేశ్వరుడు

అమరావతి: మండలంలోని మల్లాది గ్రామంలో వేంచేసియున్న వటవృక్షాంతర్గత వెంకటేశ్వరస్వామి వారికి శనివారం సందర్భంగా చందనాలంకారం చేసి ప్రత్యేక పూజలు, శాంతికల్యాణం నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం పంచసూక్తయుత పంచామృతస్నపన నిర్వహించారు. స్వామి వారికి సుమారు 5కేజీల మంచి గంధంతో అలంకారం చేశారు. అనంతరం పుష్పమాలలు, తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు శాంతికల్యాణ ప్రక్రియను ఆలయ అర్చకస్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు, యాజ్ఞీకబ్రహ్మ పర్చూరి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పెదకూరపాడు: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో గ్రామంలో కాటూరి మెడికల్ కాలేజీ సహకారంతో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి 500 మంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి హరిబాబు, కృష్ణారావులు ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే దృఢసంకల్పంతో ఉచిత వైద్య శిబిరాలు ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలు అనంతరం శుక్లాలు ఉన్నవారిని కాటూరి మెడికల్ కళాశాలలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు.

ఈదురుగాలులకు నేలవాలిన చెట్లు



ఇరుకుపాలెం వద్ద రోడ్డు పై అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తున్న పోలీసులు

ముప్పాళ్ళ: ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. శనివారం తెల్లవారుజామున ఆకాశం మేఘావృతంతో పాటుగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న మండలవాసులకు ఉపశమనం లభించినప్పటికీ, కల్లాల్లో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడ్డారు. మిరప, మొక్కజొన్న రైతులు పట్టాలతో పరుగులు తీసి కల్లాల్లో ఉన్న పంటలపై కప్పుకొని పంటలను కాపాడుకున్నారు. సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధానరహదారిపై ఇరుకుపాలెం వద్ద చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ముప్పాళ్ళ పోలీసులు స్థానికుల సాయంతో క్రేన్‌తో విరిగిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.